క్లుప్తంగా

హెల్మెట్‌పై అవగాహన



మాట్లాడుతున్న సాయి ప్రసాద్

శ్రీరాంపూర్: విధి నిర్వాహణలో ఎంత రక్షణతో పని చేస్తామో డ్యూటీలకు వచ్చేటప్పుడు అంతే రక్షణతో రావాలని ఆర్కే 7గని మేనేజర్ సాయి ప్రసాద్ తెలిపారు. గనిపై శనివారం ఆయన హెల్మెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బైక్‌లపై డ్యూటీలకు వచ్చేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు హెల్మెట్ లేకపోతే తలకు గాయమై చాలా మంది మృత్యువాత పడుతున్నారన్నారు. సింగరేణిలో నో హెల్మెట్, నో డ్యూటీ విధానం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అండర్ మేనేజర్లు రవీందర్, వెంకట్‌రామ్, రవితేజ, ఇంజనీర్లు సుదీర్, రమేశ్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ మెండె వెంకటీ, నాయకులు తొంగల రమేశ్, అశోక్‌లు పాల్గొన్నారు.

సాయిశివకు సన్మానం



మంచిర్యాలఅర్బన్: స్థానిక మిమ్స్ డిగ్రీ కళాశాలలో చదివిన ఇసంపల్లి సాయిశివ జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో న్యాయమూర్తిగా ఎంపికైనందుకు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



రామకృష్ణాపూర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రాంతంలో శనివారం నాగుపాము కలకలం రేపింది. ఇళ్లకు సంబంధించిన కార్యాలయంలో విషసర్పం రావడంతో అక్కడున్న వారు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి సమాచారం అందించారు. దీంతో మహేందర్ అనే సొసైటీ సభ్యుడు అక్కడికి వచ్చి పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశాడు.

ఉచిత దంత వైద్యశిబిరం

జైపూర్: మండల కేంద్రంలో పెద్దపెల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 50మందికి ఉచితం దంత పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ, ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి, ఉపసర్పంచ్ అంబల్ల సంపత్‌రెడ్డి, దంత వైద్యులు శ్రీకాంత్, సుమలత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి బస్తీబాట

పాతమంచిర్యాల: ప్రజా సమస్యల పరిపరిష్కారానికి ఆమ్‌ఆద్మీ బస్తీబాట చేపడుతుందని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నయీంపాషా, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మాలేం మధు అన్నారు. శనివారం జిల్లాలోని పాతమంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, తిరుపతి, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, మున్నా హరీష్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం లీడర్‌గా తహసీల్దార్ శ్రీనివాస్



మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ లీడర్‌గా స్థానిక తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ టీంలో సభ్యులుగా తహసీల్దార్, సీఐ, ఎస్సై, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ ఈఈ, ఏఈఈ(ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్), టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (మున్సిపాలిటీ) ఉంటారు. మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాల ఫిర్యాదులు, ఆరోపణలు వస్తే టీం సభ్యులు విచారణ చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుంది. అనంతరం సభ్యుల నిర్ణయం మేరకు టీం లీడర్ నేతృత్వంలో అక్రమ నిర్మాణాలు తొలగించాల్సి ఉంటుంది. ఇదివరకు టీం లీడర్‌గా సీఐకి బాధ్యతలు ఉండేవి. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధుల్లో బిజీగా ఉండడంతో అక్రమ నిర్మాణాలపై తగినంత సమయం కేటాయించలేక పోయారని తెలుస్తుంది. మిగిలిన అధికారులకు బాధ్యత లేకపోవడంతో ఎలాంటి అక్రమ నిర్మాణాల ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 1/70చట్టం అమల్లో ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు అధిక సంఖ్యలో వెలిశాయని ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం లీడర్‌గా నియమితులైన తర్వాతనైనా అక్రమ నిర్మాణాలు ఆగేనా...? అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

వావ్.. హలీమ్



హలీమ్, హరీస్ కొనుగోళ్లు చేస్తున్న దృశ్యం

సండే స్పెషల్

- రంజాన్ వేళ అధిక విక్రయాలు
- మంచిర్యాలలో వెలిసిన ప్రత్యేక కేంద్రాలు

మంచిర్యాలఅర్బన్: రంజాన్ మాసంలో హరీస్, హలీమ్‌కు ప్రత్యేకత ఉంది. రంజాన్ మాసంలో రోజా ఉన్న వారంతా ఉపవాస దీక్షలు విరమించిన తర్వాత ముస్లిం సోదరులు ఎక్కువ శాతం (బలవర్ధక ఆహారం) వీటిని తినేందుకు ఇష్టపడుతుంటారు. రంజాన్ ముస్లింల పండుగ కానీ హిందువులు కూడా ఈ పండుగ కోసం ఎదురుచూస్తుంటారు. నెల రోజులు మాత్రమే దొరికే హలీమ్ కోసం ఏడాదంతా ఎదురుచూస్తారు. ఆ రుచి అంత అద్భుతంగా ఉంటుంది. రంజాన్ ప్రారంభం కావటంతో జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో ప్రత్యేక కేంద్రాలు వెలిశాయి. విద్యుత్‌బల్బులతో హలీం కేంద్రాలను అలంకరించారు. హైదరాబాద్, ఇతరత్రా ప్రాంతాల నుంచి ఇక్కడకు రప్పించి రుచికరమైన వంటలను అందిస్తూ ఆకర్షిస్తున్నారు.

48పదార్థాల వరకు వినియోగం..



అన్ని వంటకాలలాగా హలీమ్(మటన్), హరీస్(చికెన్) తయారుచేయటం అంత సులువేమీకాదు. మాంసం, గోధుమలు కలిపి ఎన్నో గంటలు చిన్న మంటమీద ఉడికించి కలుపుతూ ఉండాలి. హలీమ్, హరీష్ తయారు చేసేందుకు సుమారు 10నుంచి 12గంటల వరకు పడుతుంది. ఉదయం నుంచి ఇందుకు సిద్ధం అవుతారు. పెద్దపెద్ద పాత్రలు ఉపయోగిస్తారు. మాంసం, గోధుమలు, నెయ్యి, జాజికాయ, సాజీర, పాలు, గులాబిరేకులు, యాలకులు, మొగ్గ, మిరియాలు, పూత, వాయిలోంగ్, గసాలా, మినపప్పు, మునగపప్పు, శనగపప్పు, అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయాలు, తమలపాకు ఏర్లు ఇలా 48రకాల ఆహార పదార్థాలు వినియోగిస్తూ తయారుచేస్తున్నట్లు చెబుతున్నారు. చికెన్‌తో ఈ పదార్థాలు ఉపయోగించి హరీస్ తయారు చేయటం ప్రత్యేకత.

శక్తిని పెంచటంతో...

ఉపవాస దీక్షల్లో ఉన్నవారంతా వీటిని తింటుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కఠోర దీక్షల్లో ముస్లింలు ఉంటారు. ఉపవాసదీక్షలు విరమించిన తర్వాత ఈ పదార్థాన్ని తింటే కోల్పోయిన శక్తి వెంటనే వస్తుంది. పోషక పదార్థాలు ఎక్కువగా ఉండటం వల్ల ధరను సైతం లెక్క చేయకుండా హలీం, హరీస్ తినేందుకు మొగ్గుచూపుతున్నారు. చాలా మంది ఇళ్లకు తీసుకెళ్లి కుటుంబసభ్యులతో కలిసి ఆరగిస్తున్నారు.



దయివడ, కుర్బానీ మీటా, డబుల్‌కా మీటా.

మంచిర్యాలలో..



హలీమ్, హరీస్ తీస్తున్న దృశ్యం

మంచిర్యాల బస్టాండ్‌రోడ్‌లో హలీం కేంద్రాలు ఉన్నాయి. బస్టాండ్ సమీపంలో రెండు, బెల్లంపల్లి చౌరస్తా సమీపం నుంచి ఐబీ చౌరస్తా వరకు ఏడు, ఎనిమిది వరకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక హలీం కప్పు (ప్లాస్టిక్ డబ్బా) 250గ్రాములు రూ140నుంచి రూ560(పరిమాణం బట్టి), హరీస్(చికెన్) రూ80వరకు రూ.320ధరలు పలుకుతున్నాయి. ఇవే కాకుండా డబుల్ కా మీటా, కుర్బాన్‌మీటా, దయివడ, రూ.50నుంచి రూ.70వరకు ధర ఉన్నాయి. రుమాల్‌రోటీ, రుచికరమైన కబాబ్‌లను కస్టమర్లకు తగ్గట్టుగా తయారీ చేసి ఇస్తున్నట్లు హలీం కేంద్రం నిర్వాహకుడు వాహిద్ తెలిపారు. సాయంత్రం కాగానే ఈ కేంద్రాల వద్ద జనసందోహంతో నిండిపోతుంది.

హలీం బలవర్ధక ఆహారం



రంజాన్ మాసంలో ఉన్నవారంతా ఉపవాస దీక్షలు విరమించిన తర్వాత బలవర్ధకమైన ఆహారం హలీం, హరీస్ తింటుంటారు. శక్తిని పెంచేందుకు ఎంతో దోహదం చేస్తుంది. మసాల, నెయ్యి, గోధుమలు ఇతరత్రా పదార్థాలతో తయారు చేస్తారు. గిరాకీ బాగుంది.

– సతాతర్, కొనుగోలుదారుడు

ఉచిత విద్య ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



పాఠశాలలో ఎమ్మెల్యే, కౌన్సిలర్లు, తదితరులు

నస్పూర్: పేద ప్రజలకు ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. 'మనఊరు–మన బడి' 'మన బస్తీ–మన బడి' కార్యక్రమంలో భాగంగా తీగల్‌పహడ్ ప్రైమరీ పాఠశాలకు రూ.25లక్షల నిధులు, ఆర్కే–6 కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రూ.10లక్షల నిధుల ఆధునీకరించిన తరగతి గదులు, వంటశాల, పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి కేజీ టూ పీజీ ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో అనేక గురుకుల పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించి ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు రేగుంట చంద్రశేఖర్, పంబాల గంగ, ఎంఈవో పోచయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

నస్పూర్: పట్టణ పరిధిలోని 19వ వార్డులో రూ.6లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే దివాకర్‌రావు శనివారం ప్రారంభించారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ప్రదర్శన' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

జన్నారం: బీసీలకు 50శాతం రిజర్వేషన్ ప్రకటించాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 3న అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇచ్చిన పార్లమెంట్ వద్ద ప్రదర్శన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ కులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోకన్వీనర్లు కడార్ల నర్సయ్య, కొడూరి చంద్రయ్య కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తైన బీసీలకు రిజర్వేషన్ ప్రకటించకపోవడంతో రాజకీయం, ఆర్థికంగా, సామాజికంగా బీసీ కులాల వారు వెనుకబడిపోతున్నారని ఆరోపించారు. బీసీలకు జనాభా ధామాషా ప్రకారం 50శాతం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లిన వారు కాకుండా మిగితా బీసీ కులాల వారు మండల, జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు విజయ్ తదితరులున్నారు.

నేడు సీపీఐ జనరల్ బాడీ సమావేశం



మందమర్రిరూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాండూర్/నస్పూర్/లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/చెన్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతూ తమ భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకోవడానికి ఆదివారం(నేడు) నస్పూర్‌లోని న్యూ కమ్యూనిటీ హాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసినట్లు సీపీఐ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య విలేకరులతో వివరించగా, మందమర్రి, లక్సెట్టిపేట, చెన్నూర్, తాండూర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం



బెల్లంపల్లి: దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



చెన్నూర్‌లో...

చెన్నూర్/బెల్లంపల్లి: కాంగ్రెస్ అధినాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ శనివారం బెల్లంపల్లి, చెన్నూర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ర్యాలీ నిర్వహించారు. రాహుల్‌గాంధీపై విధించిన అనర్హత వేటును బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బండి ప్రభాకర్, రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రొడ్డ శారద, చెన్నూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్నూరి శ్రీధర్, నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బొడ్డు రాకేశ్, పాతర్ల నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించవచ్చు

- కలెక్టర్ బాదావత్ సంతోష్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆపత్కాల సమయంలో నిర్వహించే సీపీఆర్(కార్డియో పల్మోనరీ రిససిటేషన్)తో ప్రాణాలు రక్షించవచ్చని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని పద్మావతి గార్డెన్స్‌లో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా చిన్నారుల నుంచి పెద్దల వరకూ గుండెపోటుకు గురవుతున్నారన్నారు. సీపీఆర్ శిక్షణతో కొంతవరకైనా గుండెపోటు మరణాలను తగ్గించవచ్చన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సీపీఆర్ శిక్షకుడు రమణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓలు వేణు, శ్యామలాదేవి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇత్యాల కిషన్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ దేశ్‌పాండే, ఉపాధ్యక్షుడు మధుసూదన్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కోశాధికారి పడాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ఆస్నాదలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్



లక్సెట్టిపేట: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



చెన్నూర్: చిరుధాన్యాలపై అవగాహన

కొనసాగుతున్న పోషణ పక్వాడ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ పక్షోత్సవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషకాహారంపై, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మారుతినగర్, ఒడ్డెర కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్ కనుకుంట్ల తిరుమల ఆధ్వర్యంలో పిల్లలకు ఆకు కూరలు, కాయగూరలతో చేసిన భోజనం వల్ల కలిగే లాభాలను వివరించారు. కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, మిల్లెట్స్ తినడం వల్ల పొందే పోషక విలువలను వివరించారు. చేతులను సబ్బుతో శుభ్రం చేసుకునేలా వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయాలు విక్టోరియా, రాదమ్మ పాల్గొన్నారు. రాళ్లపేట్ 1, 2, గౌతమినగర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులు, కిశోర బాలికలు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పోషకాహారం, చిరుధాన్యాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మాదవి, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు శారద, పద్మ, జయ, ఏఎన్ఎం గీత, మమత పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు

చెన్నూర్/జన్నారం/లక్సెట్టిపేట/చెన్నూర్‌రూరల్: కిశోర బాలికలకు చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలుంటాయని, పోషకాహారం కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు, పంచాయతీ కార్యాలయాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో జన్నారంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ,సర్పంచ్ సులోచన, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, సంధ్య, ఆయుష్ వైద్యుడు ఆదినారాయణరావు పాల్గొనగా, చెన్నూర్‌లో సీడీపీవో మనోరమ, కస్తుర్బా పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాధవి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు. లక్సెట్టిపేటలో సీడీపీవో రేష్మ, సూపర్‌వైజర్ దీప, ప్రధానోపాధ్యాయురాలు యశోధర, కో ఆర్డినేటర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు శంకరమ్మ, నీరజ, సుగుణ పాల్గొనగా, చెన్నూర్‌రూరల్ మండలంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, సర్పంచ్ ఏశ్వేరం నాగభూషణం, ఎంపీటీసీ ఇనుగంటి వసంత, బీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.



జన్నారం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్



మంచిర్యాలటౌన్: రాళ్లపేట్ అంగన్‌వాడీ కేంద్రంలో..



జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లో..

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం

బెల్లంపల్లి: కాసిపేట మండల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల బీ ఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. సమ్మేళనంలో ఏఎంసీ చైర్మన్, మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల, గ్రామాధ్యక్షులు, అనుబంధల సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కలమడుగులో...

జన్నారం: మండలంలోని కలమడుగులో ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యేతో పాటు ఇన్‌చార్జి గంగాధర్‌గౌడ్ హాజరవుతారన్నారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సత్యసాయి సేవా సంస్థ సేవలు అభినందనీయం

నెన్నెల: సత్యసాయి సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ రమాదేవి, ఎస్సై రాజశేఖర్ అన్నారు. నెన్నెల సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవసేవే మాదవ సేవ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం శాలువాలతో సన్మానించి బహుమతులు అందజేశారు.

కుక్కలకు చర్మవ్యాధి

భీమారం: మండల కేంద్రంలో వీధి కుక్కలకు చర్మవ్యాధి సోకింది. ఇటీవల రాబిస్ వ్యాధితో అనేక మందిని గాయపర్చిన కుక్కలకు చర్మవ్యాధులు సోకడంతో అవి వీధుల్లో సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దాదాపు 50కుక్కలకు చర్మవ్యాధి సోకి బాధపడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు కుక్కలకు వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899